AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

18-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ఆవును జాతీయ మాతగా ప్రకటించాలి

**అక్షరటుడే, లింగంపేట:** హిందువులు ఎంతో విశిష్టతగా పూజించే ఆవును జాతీయమాతగా ప్రకటించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్ అన్నారు. ఈ సందర్భంగా లింగంపేట తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి, ఎస్సై దీపక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆవును జాతీయ మాతగా ప్రకటించాలని కోరుతూ ఈనెల 27న లింగంపేటలో ర్యాలీ నిర్వహించినట్లు, సంతకాల సేకరణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యులు దత్తురాం, పెద్ది శివయ్య, ఉదయ్, రాజారాం రమేష్, వెంకటేష్, రంజిత్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్మూర్ బల్దియా పరిధిలో అక్రమాలను అరికట్టాలి : ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై మున్సిపల్, పోలీసు అధికారులు దృష్టి పెట్టాలని.. సమన్వయంతో వాటిని అరికట్టాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలో మిగిలిపోయిన సీసీ, బీటీ రోడ్లు, డ్రెయినేజీలు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రజలకు నీటి సరఫరా చేయాలన్నారు. కొందరు కౌన్సిలర్లు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు తనకు ఫిర్యాదు చేశారని.. నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని.. అప్పుడు ఎవరికీ సమాధానం చెప్పే అవసరం లేదని ఎమ్మెల్యే సూచించారు. మున్సిపాలిటీ లో పనుల కోసం ఏ రాజకీయ నాయకుడిని, ఎమ్మెల్యేని కలిసే అవసరం లేదన్నారు. నేరుగా అధికారులను కలిసి నిబంధనల ప్రకారం పనులు చేయించుకోవాలన్నారు. రాజకీయ నాయకుల ప్రమేయాన్ని తగ్గించాలని మున్సిపల్ అధికారులకు ఆయన సూచించారు. అవినీతి కనబడితే ఆర్మూర్ ప్రజలు తనకు ఫోన్‌లో ఫిర్యాదు చేస్తే తానే నేరుగా ఆ ప్రాంతానికి వస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.


## అజాగ్రత్తతో బ్లాక్‌స్పాట్ల వద్ద రోడ్డు ప్రమాదాలు..




**అక్షరటుడే, మెండోరా :** బ్లాక్‌స్పాట్ల వద్ద అజాగ్రత్తగా వాహనాలు నడపవడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆర్మూర్ సీఐ జాన్‌రెడ్డి అన్నారు. దూదిగాం కోతిదేవుడు సమీపంలోని బ్లాక్ స్పాట్ ప్రాంతంలో రోడ్డు భద్రతపై శనివారం మెండోరా ఎస్సై సుహాసిని, సర్పంచ్ బాబా, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దూదిగాం బ్లాక్‌స్పాట్ వద్ద గ్రామ ప్రజలను సమీకరించి రోడ్డు ప్రమాదాల నివారణపై సమగ్రంగా అవగాహన కల్పించారు. హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యత, అధిక వేగం వల్ల జరిగే ప్రమాదాలు, రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం వల్ల కలిగే ప్రమాదాలపై వివరించారు. అలాగే గతంలో జరిగిన ప్రమాదాల ఉదాహరణలు చూపించి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 'గో స్లో' నియమాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రమాదాల నివారణ కోసం బ్లాక్ స్పాట్ వద్ద 'గో స్లో' హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

తెల్ల కాగితాలపై రాసుకున్న భూముల ఒప్పందాల (సాదాబైనామా) క్రమబద్ధీకరణకు మోక్షం లభించనుంది. ప్రభుత్వం నిబంధనలు సవరించి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు క్లియర్ కానున్నాయి. హక్కుల కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలకు ప్రభుత్వ తాజా నిర్ణయంతో పట్టాలు అందనున్నాయి. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా రెవెన్యూ యంత్రాంగంలో కదలిక మొదలైంది.

- అక్షరటుడే, భీమ్‌గల్




# సాదాబైనామాలకు మోక్షం

- క్రమబద్ధీకరణకు సర్కార్ గ్రీన్ సిగ్నల్
- జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో వేల దరఖాస్తులు
- మండలాల వారీగా విచారణకు రెవెన్యూ యంత్రాంగం సన్నద్ధం

| మండలం దరఖాస్తులు: | |
|---|---|
| నిజామాబాద్ రూరల్ | 315 |
| డిచ్‌పల్లి | 158 |
| ఆర్మూర్ | 280 |
| నవీపేట | 142 |
| బోధన్ | 340 |
| సిరికొండ | 195 |
| భీమ్‌గల్ | 210 |
| జక్రాన్‌పల్లి | 85 |
| ఎడపల్లి | 125 |
| మాక్లూర్ | 160 |
| ముప్కాల్ | 92 |
| బాల్కొండ | 178 |

రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 జూన్ 2వ తేదీకి ముందు జరిగిన సాదాబైనామా కొనుగోళ్లకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో 2016, 2020లలో దరఖాస్తులు స్వీకరించినప్పటికీ, వివిధ కారణాల వల్ల ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. నిజామాబాద్ జిల్లాలో వేలాది మంది రైతులు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకున్నప్పటికీ, విచారణలో జాప్యం, అమ్మిన వారు ముందుకు రాకపోవడం వంటి కారణాలతో పట్టాలు జారీ కాలేదు. ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్లియర్ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాలో దరఖాస్తులు

### క్షేత్రస్థాయి విచారణే కీలకం

సాదాబైనామా కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టనున్నారు. అర్హులకు న్యాయం జరిగేలా పంచనామా నిర్వహించనున్నారు. తహశీల్దార్ ద్వారా నివేదికలు ఆర్డీవోకు పంపించాల్సి ఉంటుంది. ఆర్డీవో ఆమోదంతో దరఖాస్తుదారులకు డిజిటల్ పట్టాలు జారీ అవుతాయి. కనీసం పన్నెండేళ్లకు పైగా భూమి స్వాధీనంలో ఉంటే విక్రయదారుడి అఫిడవిట్ అవసరం లేకుండానే కొనుగోలుదారుడి స్వీయ ధ్రువీకరణతో పట్టా ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

### నిరాకరించడంతో

భూముల ధరల పెరుగుదల కారణంగా అమ్మినవారు రిజిస్ట్రేషన్‌కు సహకరించక పోవడంతో వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి. ఇప్పుడు ప్రభుత్వం సరళీకృతం చేసిన నిబంధనలతో ఈ సమస్యలన్నీ తొలగిపోతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పట్టాల పంపిణీ చేయాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది.

## జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో సన్మానం

**అక్షరటుడే, ఇందూరు:** జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నాగమోహన్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శనివారం ఆయుష్ శాఖ ఇన్‌ఛార్జి డాక్టర్ జె.గంగాదాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విభాగం సభ్యులు సూపరింటెండెంట్‌కు ఔషధ మొక్కను అందజేశారు. కార్యక్రమంలో యోగా వైద్యులు తిరుపతి, ఆయుష్ విభాగం ఫార్మాసిస్ట్‌లు న్యావనంది పురుషోత్తం, ఉమాప్రసాద్, నీరజ, పారామెడికల్ సిబ్బంది రమేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: సీపీ



**అక్షరటుడే, బోధన్:** ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీపీ సాయిచైతన్య అన్నారు. ఈ మేరకు ఎడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగల్‌పాడ్ చౌరస్తా వద్ద ప్రజలు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దీంట్లో భాగంగా 6వ రోజు శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఎడపల్లిలో జరుపుతున్నామన్నారు. ప్రస్తుత కాలంలో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు ప్రతి ఒక్కరి ద్వారా రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం "అరైవ్ అలైవ్ " కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన జనసేన నాయకుడు

**అక్షరటుడే, కామారెడ్డి:** టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణానికి చెందిన జనసేన నాయకుడు, క్రెడా అధ్యక్షుడు లక్ష్మీ నర్సాగౌడ్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు క్రెడా ప్రధాన కార్యదర్శి రాంచందర్ నాయక్, కోశాధికారి మాదాస్ రాజలింగం, సెక్రెటరీలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్, మాజీ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్, జమిల్, కాంగ్రెస్ నాయకులు రంగ రమేష్‌గౌడ్, బల్ల శ్రీనివాస్, అరుణ్, మెహర్ బాబా గౌడ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



## జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా ప్రీమియర్ లీగ్ ర్యాలీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ ప్రీమియర్ లీగ్ ర్యాలీ ఉత్సాహంగా నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్, నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతినిధులు, పోలీసు సిబ్బంది, ఆయా కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ర్యాలీ ఉదయం డీఎస్‌ఏ మైదానం నుంచి పాలిటెక్నిక్ గ్రౌండ్ వరకు సాగింది. డీఎస్‌ఏ గ్రౌండ్‌లో ప్రీమియర్ లీగ్ ర్యాలీని సీపీ సాయిచైతన్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ నిర్వహించనుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎంతోమంది క్రీడాకారులను దేశానికి అందించిన ఘనత నిజామాబాద్ జిల్లాకు దక్కిందన్నారు. ఈ ప్రీమియర్ లీగ్‌లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్, యోగా తదితర క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో అన్ని మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొనవచ్చన్నారు. క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రైజ్ మనీ కూడా డిక్లేర్ చేయడం జరిగిందని సీపీ తెలిపారు. యువతను సన్మార్గంలో నడిపించాలనే ఉద్దేశంతో యువతను ప్రోత్సహించేందుకు ఈ లీగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది చనిపోయారని, కానీ రోడ్డు ప్రమాదాల వల్ల జిల్లాలో 2025లో సుమారు 300 మంది మరణించారన్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్ వల్లనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌సీ చైర్మన్ సాయి చైతన్య, కన్వీనర్ బస్వారెడ్డి, జనరల్ సెక్రెటరీ కవితా రెడ్డి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రజనీకాంత్ (ఫిజికల్ సెక్యూరిటీ), డాక్టర్ శిరీష్ కుమార్ (సైబర్ సెక్యూరిటీ), పితానీ, శివప్రసాద్, గణేష్ గుప్తా, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్‌కు మహిళలే గుణపాఠం చెప్తారు..: ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఇందూరు:** మహిళా బిల్లును అడ్డుకున్న కాంగ్రెస్‌కు భవిష్యత్తులో మహిళలే తగిన గుణపాఠం చెబుతారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తాలో కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. 2023లో ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతు పలికినట్టే పలికి ఇప్పుడు వ్యతిరేకించడం సమంజసం కాదన్నారు. డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు కూడా మహిళల పట్ల వారికున్న నైతికతను బయట పెట్టాయన్నారు. మహిళా శక్తి అంటూ చెప్పే కాంగ్రెస్ అవకాశం ఇవ్వాల్సిన సమయంలో వెనక్కి తగ్గిపోవడం సిగ్గుచేటన్నారు. మోదీ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి వ్యతిరేక పనులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని భవిష్యత్తులో వారికి తగిన గుణపాఠం తప్పదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో బీజేపీ ముందడుగు వేసిందన్నారు. 60 ఏళ్లుగా కాంగ్రెస్ చేయని మహిళా బిల్లును ప్రవేశపెడితే ప్రతిపక్షాలు అడ్డుకోవడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు బొబ్బిలి సువర్ణ వేణు, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, మల్లేష్ యాదవ్, మల్కాయి మహేందర్, జ్యోతి మురళి మహిళా నాయకురాలు వనిత తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాల్సిందే..

**అక్షరటుడే, బాల్కొండ:** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద కొత్తగా మంజూరు కోసం సిద్ధంగా ఉన్న 127 బ్యాచ్ ఫైళ్లపై ఆయన సంతకాలు చేశారు. బాల్కొండ నుంచి 19మంది దరఖాస్తుదారులు, వేల్పూర్ 20, మెండోరా 15, ముప్కాల్ 10, మోర్తాడ్ 24, భీమ్‌గల్ 39 మంది దరఖాస్తుదారులకు చెందిన ఫైళ్లను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరిశీలించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్లు ఫైళ్లను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే సంతకాలు పూర్తి చేసి ప్రభుత్వానికి పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాసరి వెంకటేష్, లింబారెడ్డి, సర్పంచ్ రామ్ రాజ్, గాండ్ల రాజేష్, శరత్, నారాయణ, కన్నె పోశెట్టి, ఫయాజ్, బుస నరహరి, రాజగౌడ్, పాపాయి పవన్, ఇష్తికర్ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సంఘాలు ఆడిట్‌కు సిద్ధంగా ఉండాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మహిళా సంఘాలు 2025-26 ఆర్థిక సంవత్సరం అంతర్గత ఆడిట్‌కు పుస్తకాలతో సిద్ధంగా ఉంచాలి ఏపీఎం రామ్ నారాయణ్ గౌడ్ తెలిపారు. ఎల్లారెడ్డి మండల మహిళ సమాఖ్యలో నెలవారి కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షురాలు పావని అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండల సమాఖ్య ఆర్థిక అంశాలపై, గ్రామ సంఘాల, చిన్న సంఘాల సంస్థాగత నిర్మాణం ఆర్థిక అభివృద్ధి వ్యాపార కార్యక్రమలపై చర్చించారు. సమావేశంలో మండల, గ్రామ సంఘాల పదాధికారులు, మండల సమాఖ్య అకౌంటెంట్ మహేష్, సీసీలు సంధ్య, రమేష్, గోపాల్, సుజాత పాల్గొన్నారు.

## బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని 20డివిజన్‌లోని ఎల్లమ్మగుట్టలో బాలల పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ న్యాలం సునీత రాజు ఆధ్వర్యంలో ఈ కమిటీ ఏర్పాటైంది. సమావేశానికి అంగన్‌వాడీ సూపరింటెండెంట్ ప్రియదర్శిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చైతన్య తదితరులు హాజరయ్యారు.

## వెల్మల్‌లో శివుడి విగ్రహం ప్రతిష్ఠాపన



**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట్ మండలం వెల్మల్ గ్రామంలోని శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహాన్ని సర్పంచ్ గోజ్జి దేవేందర్, పలుగుట్ట మంగి రాములు మహరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగి రాములు మహరాజ్ మాట్లాడుతూ.. శివయ్య సమస్త లోకాలకు కాపాడేవాడని.. శ్మశాన వాటికలో శివాలయం లేదా విగ్రహం ఉండడం ద్వారా అక్కడికి వచ్చే వారికి ధైర్యం, ఆత్మశాంతి లభిస్తుందన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, వార్డ్ మెంబెర్లు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పొలం గట్టుపై పోయిన ప్రాణం.. వడదెబ్బతో రైతన్న మృతి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** వడదెబ్బకు తన వ్యవసాయ క్షేత్రంలోనే ఓ రైతు కుప్పకూలాడు. ఈ విషాదకర ఘటన ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల గ్రామంలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రైతు లింగాల రాములు (59) శుక్రవారం ఉదయం తన పొలంలో పనులు ముగించుకుని సాయంత్రం సుమారు 4 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అనంతరం మరో పొలానికి నీళ్లు పారించేందుకువెళ్లి, రాత్రి వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. వెంటనే ఆయన కుమారులు పొలానికి వెళ్లి వెతికగా.. రాములు పొలం గట్టుపై అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుమారుడు బాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై మహేష్ వెల్లడించారు. ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బతో ఆయన మృతి చెందినట్లు భావిస్తున్నారు.

పల్లెలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస వసతులు కరువై గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండేళ్ల పాటు పాలకవర్గాలు లేక పల్లెలు ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. ఇటీవల ఎన్నికలు జరిగగా కొత్త పాలక వర్గాలు కొలువుదీరాయి. దీంతో సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజలు ఆశించారు. కానీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఉన్నాధికారులకు ఫిర్యాదులు చేయాల్సి వస్తోంది.

– అక్షరటుడే, గాంధారి




# పల్లె సమస్యలపై పట్టింపు లేదా..?

- పాలకవర్గాలు కొలువైనా తీరని సమస్యలు
- ఉన్నతాధికారులకు పెరుగుతున్న ఫిర్యాదులు
- వారంరోజుల్లోనే ఇద్దరు కార్యదర్శులు, సర్పంచ్ తీరుపై నిరసన

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఎన్నో నూతన కార్యక్రమాలకు పల్లెల్లో శ్రీకారం చుట్టింది. అయితే వీటిని పక్కాగా అమలు చేయాల్సిన పంచాయతీ పాలకవర్గాలు గ్రామ అభివృద్ధిని పక్కనపెట్టి అనవసర రాజకీయాలకు వెళ్తున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. దీంతో పల్లెల్లో మౌలిక సదుపాయాలు కొరవడి ప్రజలు అల్లాడుతున్నారు.

### ఇద్దరు కార్యదర్శులు, సర్పంచ్ తీరుపై ఫిర్యాదులు..

గాంధారి మండలంలోని కేవలం వారం రోజుల్లోనే ఇద్దరు సెక్రెటరీలు, ఒక సర్పంచ్‌పై ఎంపీడీవో రాజేశ్వర్‌కు ఫిర్యాదులు అందజేశారు. ప్రజలు ఎంతగానో ఆశించిన నూతన పాలకవర్గం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని ఉద్దేశంతో పాలకవర్గం లో కొందరు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల్ని తెలుసుకోలేకపోయి వారి సమస్యలు పరిష్కారం దిశగా అడుగులు వేయడం లేదు. ఆయా గ్రామ పంచాయతీల సెక్రెటరీలు ఇద్దరు ఒక్క సర్పంచ్‌పై తగు చర్యలు తీసుకోవాలని గ్రామాభివృద్ధికి సహకరించడం లేదని గ్రామస్థులు ఎంపీడీవో ను కలిసి వినతి పత్రం అందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

### పాలకవర్గాలున్నా సమస్యలు తీరవు..

ఎండాకాలం ఎండలు మండుతున్నాయి. ఎప్పుడూ లేనంతగా ఈ సీజన్‌లో ఎండలు ఉండనున్నాయని వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. దీనికి తగ్గట్లుగా పంచాయతీ పాలకవర్గాలు గ్రామాల్లో ఏర్పాట్లు చేయాల్సి ఉండగా.. ఆ దిశగా చాలా గ్రామాల్లో పాలకవర్గాలు పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారులు, ప్రజాప్రతినిధులు దొందు దొందే..

గ్రామాల్లోని సమస్యలను పట్టించుకోకుండా తమను ఇబ్బంది పెడుతున్నారని రెండు గ్రామాల కార్యదర్శులు, అలాగే ఓ తండా సర్పంచ్‌పై ఇటీవల ఎంపీడీవోకు ఫిర్యాదులు వెల్లాయి. తిమ్మాపూర్‌లో విధులకు సరైన సమయానికి రాకుండా.. సమస్యలను పట్టించుకోవడం లేదంటూ గ్రామస్థులు ఎంపీడీవో రాజేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే రామ్‌లక్ష్మణ్‌పల్లిలోనూ మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తూ గ్రామాన్ని పట్టించుకోవడం లేదంటూ కార్యదర్శిపై ఎంపీడీవోకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. మరోవైపు కాయితీ తండాలో తమగోడు వినట్లేదని.. చిన్నచిన్న సమస్యలు సైతం పరిష్కరించ కుండా గ్రామస్థులను పట్టించుకోవట్లేదని ఆరోపిస్తూ గ్రామ స్థులు ఎంపీడీవోకు విన్నవించారు. కొన్ని గ్రామాల్లో తప్ప.. ప్రతి గ్రామంలోనూ పరిస్థితి ఇలాగే ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

### విచారణ చేసి నివేదికను సమర్పిస్తాం..



పలు గ్రామాల ప్రజల ఫిర్యాదుల మేరకు రెండుగ్రామాల సెక్రెటరీలు, ఓ తండా సర్పంచ్‌పై విచారణ జరుపుతున్నాం. ఇందుకోసం ఎంపీవో లక్ష్మీ నారాయణతో క్షేత్రస్థాయిలో పర్యటించాం. పూర్తి విచారణ జరిపి నివేదికను ఉన్నతస్థాయి అధికారులకు అందజేస్తాం.

– రాజేశ్వర్, ఎంపీడీవో, గాంధారి

## యూఎస్ ట్రేడ్‌డీల్‌ను రద్దు చేయాల్సిందే..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** యూఎస్ ట్రేడ్‌డీల్‌ను వెంటనే రద్దు చేయాల్సింందేనని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్ అన్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద యూఎస్ ట్రేడ్ డీల్‌కు వ్యతిరేకంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా ధర్నాకు జిల్లా నుంచి భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా విపుల్ గౌడ్ మాట్లాడుతూ నియంత మోదీని గద్దె దించేవరకు యువజన కాంగ్రెస్ నిద్రపోదన్నారు. వెంటనే యుఎస్ ట్రేడ్ డీల్‌ను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిత్య పటేల్, ఆకాష్ రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ అబ్బోల్ల శ్రీకాంత్, అసెంబ్లీల అధ్యక్షులు కార్తీక్ యాదవ్, మహేందర్, చరణ్ గౌడ్, మెయిన్ అర్బన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ లైన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## వాహనాలు జాగ్రత్తగా నడపాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రోడ్డు ప్రమాదాలను అధిగమించేందుకు వాహనదారులు తమ కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకుని వాహనాలను జాగ్రత్తగా నడపాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. నాగిరెడ్డిపేట్ పోలీస్ స్టేషన్‌లో శనివారం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ తప్పనిసరి అన్నారు. హెల్మెట్ పెట్టుకోక ప్రమాదాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిలో 2,284 మంది మృతి చెందారని వివరించారు. హెల్మెట్ లేకుండా ఊళ్లోకి టూవీలర్స్ రానివ్వొద్దని సర్పంచ్‌లకు సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు. స్థానికులకు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రాజిరెడ్డి, ఎస్సై భార్గవ్ గౌడ్ ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.

## రద్దీ కొనుగోళ్లకు కొటేషన్లు సమర్పించండి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో పాత రద్దీ కొనుగోలు చేయడానికి కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ మహమ్మద్ షరీఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని పాత పుస్తకాలు, రాత పుస్తకాలు, న్యూస్ పేపర్ రద్దీ, అదేవిధంగా కొంత ప్లాస్టిక్, ఇనుము స్క్రాప్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు పాఠశాలలో సంప్రదించి కొటేషన్లు అందజేయాలని, అధిక ధరతో కొటేషన్ సమర్పించిన వారికి కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 73311 70815 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను శనివారం సర్పంచ్ సారంగి శాంతి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా పెద్దపీట వేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే రైతుల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చరణ్, వీడీసీ అధ్యక్షుడు నాగరాజ్, శ్రీనివాస్, దశరథ్, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు చిట్యాల పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



## ప్రతిష్ఠాపనకు విగ్రహామూర్తులు సిద్ధం

**అక్షరటుడే, మాక్లూర్:** గొట్టుముక్కల గ్రామంలో సుమారు రూ.25లక్షలతో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రారంభానికి సిద్ధమైంది. శనివారం నుంచి సోమవారం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనకు హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి తీర్థ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. తొలిరోజు విగ్రహాలను గ్రామంలో ఊరేగించి ఆలయ ప్రాంగణానికి చేర్చారు.

## గొంతు కోసి.. నేలకేసి బాది.. ఐదేళ్ల బాలుడి దారుణ హత్య..

**అక్షరటుడే, కామారెడ్డి:** పెద్దల వివాహేతర సంబంధాలు పిల్లలను బలి తీసుకుంటున్నాయి. తల్లిదండ్రుల క్షణిక సుఖం, చిన్నారులను బలిపీఠం ఎక్కిస్తున్నాయి. కామారెడ్డి పట్టణంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. అమాయక బాలుడిపై జరిగిన క్రూర హత్య స్థానికులను తీవ్రంగా కలిచివేసింది. ఐదేళ్ల చిన్నారుడు ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. పట్టణ సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన లక్ష్మికి వివాహం కాగా.. ఆమెకు ఐదేళ్ల శ్రావణ్, ఎనిమిదేళ్ల కూతురు ఉన్నారు. కుటుంబంలో కలహాలు రావడంతో ఆమె భర్తకు దూరంగా ఉంటూ, పిల్లలతో కలిసి వేరుగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో గత ఆరు నెలలుగా లక్ష్మి.. నర్సింలు అనే వ్యక్తితో ఆమెకు సన్నిహిత సంబంధం కొనసాగుతున్నట్లు సమాచారం. కాగా, శుక్రవారం లక్ష్మి పని మీద బయటికి వెళ్లిన సమయంలో, ఇంట్లో ఉన్న చిన్నారి శ్రావణ్‌పై నిందితుడు నర్సింలు అమానుషంగా దాడి చేశాడు. గొంతు పిసికి, నోరు-ముక్కు మూసి, నేలకేసి కొట్టి, కళ్లలో కారంపొడి పోసి దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజంపేట గ్రామానికి చెందిన లక్ష్మి బంధువు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## జనగణన తొలివిడత శిక్షణ ప్రారంభం



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలో జనగణన ప్రక్రియకు సంబంధించిన తొలి విడత శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈ శిక్షణ ఏప్రిల్ 21 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగనుంది. ఈ సందర్భంగా తొలి విడతగా 34 మంది ఎన్యూమరేటర్లు, నలుగురు సూపర్వైజర్లకు శిక్షణ అందిస్తున్నారు. జనగణన నిర్వహణ విధానాలు, డేటా సేకరణ పద్ధతులు, సాంకేతిక అంశాలపై వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ జనగణనను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కీలకమని తెలిపారు. ఈనెల 26 నుంచి మే10 వరకు స్వీయ గణన కార్యక్రమం జరుగనుందన్నారు. ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ ఈసారి జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతుందని, ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఫీల్డ్ ట్రైనర్స్ గజేందర్, బోయెడ నర్సయ్య, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ అందించారు.



## ఉమ్మడిజిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు

**ఉమ్మడిజిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. మహిళా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన కాంగ్రెస్ నిజస్వరూపాన్ని మహిళలు గమనించాలని సూచించారు. 2023లో ప్రవేశపెట్టిన బిల్లుకు మద్దతు పలికినట్టే పలికి ఇప్పుడు వ్యతిరేకించడం సమంజసం కాదన్నారు. డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు కూడా మహిళలపై వారికున్న నైతికత బయటపడిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు.** – అక్షరటుడే, నెట్‌వర్క్

